క్లుప్తంగా

ఎస్టేట్ మేనేజర్‌కు సన్మానం


సన్మానిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: ఈనెలాఖరుతో ఉద్యోగ విరమణ పొందనున్న ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యంను శనివారం ఘనంగా సన్మానించారు. జీఎం చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్టేట్ మేనేజర్‌ను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. అధికారులు రామ్మోహన్, కిరణ్‌బాబు, హన్మంతరావు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలను కాపాడాలి

జూలపల్లి: గ్రామాల్లో నాటే ప్రతీ మొక్కను కాపాడాలని ఎంపీడీవో పద్మజ సూచించారు. మండలంలోని కోనరావుపేట నర్సరీలో పెంచుతున్న హరితహారం మొక్కలను ఏపీవో సదానందంతో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. ఎంపీడీవో వెంట టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకర్, కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


సన్మానిస్తున్న ఎంపీపీ, టీచర్లు

జూలపల్లి: ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎండీ.హుస్సేన్ ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీతో పాటు ఉపాధ్యాయులు హుస్సేన్‌ను సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఎంఈవో కవిత, హెచ్‌ఎంలు సరస్వతి, ప్రదీప్‌రెడ్డి, ప్రభాకర్, ఎంపీటీసీ మమత పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు సన్మానం


సన్మానిస్తున్న ఎన్టీపీసీ అధికారులు

జ్యోతినగర్: ప్రతి ఉద్యోగికీ విరమణ సహజమని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం సంస్థలో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేసిన కొలిపాక మల్లయ్య, మోహన్‌రెడ్డి, రవికుమార్, రవీందర్‌రెడ్డి, సంజీవరావు, లక్ష్మణ్, వెంకటేశ్వర శర్మను శనివారం సన్మానించారు. జనరల్ మేనేజర్లు, ఏజీఎం(హెచ్‌ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్, ఉద్యోగ గుర్తింపు సంఘం నాయకులు, ఉద్యోగులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలి

గోదావరిఖని: బొగ్గు బ్లాకులను సింగరేణికి ప్రకటించేలా ఒత్తిడి తీసుకురావాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు కోరారు. శనివారం సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.బలరాంను హైదరాబాద్ సింగరేణి భవన్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్రం సింగరేణికి శ్రావణపల్లి బ్లాక్ కేటాయించేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. నాయకులు భూపాల్, బాలాజీ, రాములు ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామగిరి: కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావుకు ఐఎన్‌టీయూసీ అసంఘటిత కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికులకు పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని కోరారు. మండల అధ్యక్షుడు ఉడుత శంకర్, జిల్లా జనరల్ సెక్రటరీ బండ కిరణ్‌రెడ్డి, జాగిరి రజిత, వీణ శ్రీధర్ పాల్గొన్నారు.

రైతులు పరికరాలను వినియోగించుకోవాలి

సుల్తానాబాద్: రైతులందరూ వ్యవసాయ పనిముట్లు మహిళా సంఘాల సభ్యులు కిరాయిలకు అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో రవీందర్ కోరారు. మండల కేంద్రంలోని ఐకేపీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు గ్రామాలకు వెళ్తున్న స్కూల్ డ్రెస్ సామగ్రిని పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

పారిశ్రామిక ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్


నివాళి అర్పిస్తున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంత సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా రామగుండం మీదుగా మంచిర్యాల వెళ్తున్న వంశీకృష్ణకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. స్థానిక జీఎం కార్యాలయం సమీపంలో కాకా వెంకటస్వామి విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడతానన్నారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ ఉన్నారు.

ఎంపీకి ఘన స్వాగతం

రామగుండం: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి శనివారం రామగుండం నియోజకవర్గానికి చేరుకోగా బీపీసీ వద్ద డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ మహిళా ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీని సన్మానించారు. కాంగ్రెస్ అంతర్గాం మండల మహిళా అధ్యక్షురాలు షేక్ నాజియా, నఫీజ్ సుల్తానా, గంగ, అనిత, షేక్ ముంతాజ్ ఉన్నారు.

ఎంపీకి స్వాగతం పలికిన నాయకులు

పాలకుర్తి: పెద్దపల్లి ఎంపీగా ఎన్నికై పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన ఎంపీ వంశీకృష్ణకు శనివారం కన్నాల టోల్‌ప్లాజా వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్టీ సీనియర్ నాయకులు తొగరి తిరుపతి ఆధ్వర్యంలో ఎంపీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసారపు శివ, సతీశ్, నరేశ్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో ఎమ్మెల్యే, ఎస్ఈ

పెద్దపల్లిరూరల్: విద్యుత్ సరఫరాపై అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిరంతర సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. పెద్దపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎస్ఈ బొంకూరి సుదర్శన్‌తో కలిసి విద్యుత్ సరఫరాపై శనివారం సమీక్షించారు. వానాకాలంలో విద్యుత్‌పరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదీ లేదన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి రూ.40లక్షలు ఇవ్వండి

మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణాలకు రూ.40లక్షల నిధులు కేటాయించాలని కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, మాదిగశక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్నీ కోరారు. శనివారం ఎమ్మెల్యే విజయరమణారావును కలిసి వినతిపత్రం అందించారు.

మాకు ఇల్లు ఇప్పించండి

పెద్దపల్లిరూరల్: 'ఎమ్మెల్యే సాబ్ మాకు ఇండ్లు, జాగాల్లేవ్.. దరఖాస్తు చేసుకుని డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నాం.. మా లాంటి వాళ్ల సంగతేంది' అంటూ ఎమ్మెల్యే విజయరమణారావుకు పలువురు పేదలు మొరపెట్టుకున్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు లబ్ధిదారులకు కేటాయిస్తున్నారని తెలుసుకున్న దరఖాస్తుదారులు అక్కడికే పెద్దసంఖ్యలో చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అన్ని వర్గాలసంక్షేమ కోసం పనిచేస్తోందని, ఆందోళన పడాల్సిన అవసరంలేదని ఎమ్మెల్యే వారిని సముదాయించారు. ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు నిర్మించి ఇస్తుందన్నారు.

'అమాత్యుడి పేరు మార్చలేదు'

- తప్పుల తడకగా మండల సమావేశ ఆహ్వాన సర్క్యులర్
- మండల అధికారుల తీరుపై విమర్శలు


ఎంపీడీవో జారీ చేసిన సర్క్యులర్

పాలకుర్తి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ పథకం సోషల్ ఆడిట్ మండల సభకు సంబంధించిన ఆహ్వానపత్రం మండల అధికారుల బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. మండల పరిధిలోని 20గ్రామాల్లో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ బృందం సభ్యులు తుది నివేదికను సమర్పించేందుకు జూలై 1న సోమవారం మండల పరిషత్‌లో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయమై మండలంలోని విలేకరులతో పాటు జిల్లా ఉన్నతాధికారులు వివిధ విభాగాలకు చెందిన మండల, గ్రామస్థాయి అధికారులకు, జిల్లా మంత్రితో పాటు మండల పరిధిలోని మూడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు సమావేశం సమాచారం అందించేందుకు గాను ఎంపీడీవో శశికళ సర్క్యులర్ జారీ చేశారు. అయితే సర్క్యులర్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యేగా ముద్రించారు. గత ప్రభుత్వ హయాంలో ధర్మపురి ఎమ్మెల్యే అయిన కొప్పుల ఈశ్వర్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారిందనే స్పృహ కూడా అధికారులకు లేకుండా పోయింది. దీంతో పాటు జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంథని ఎమ్మెల్యేగా పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌ను ధర్మపురి పార్లమెంట్ నియోజకవర్గంగా పేర్కొన్నారు. మరోవైపు సోషల్ ఆడిట్ తనిఖీ బృందాలు జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో తనిఖీ చేపట్టి గ్రామసభలు నిర్వహిస్తే సర్క్యులర్‌లో మాత్రం జూలై 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించినట్లు పేర్కొనడం గమనార్హం. ఎంతో బాధ్యతతో ఉండాల్సిన మండల అధికారులు ప్రభుత్వ అధికారిక కార్యక్రమం నిర్వహణ ఆహ్వానం పత్రికపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భూ నిర్వాసితులకు చట్టప్రకారం పరిహారం

పెద్దపల్లిరూరల్: వరంగల్–మంచిర్యాల ఫోర్‌లేన్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ జాతీయ రోడ్డు నిర్మాణంలో ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులకు చట్ట ప్రకారం పరిహారం అందిస్తామని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో భూనిర్వాసితులతో సమావేశమై వారి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రైతు భరోసా అవగాహన సదస్సు

ఓదెల: మండలంలోని పొత్కపల్లి రైతువేదికలో శనివారం రైతుభరోసా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు మంజూరు చేసే కిసాన్ యోజన పథకం కింద జిల్లాలో 70వేల మంది రైతులకు ఈకేవైసీ చేయించినట్లు పేర్కొన్నారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, సీఈవో గోళి అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి సువర్ణ, వైస్ చైర్మన్ తాళ్లపల్లి సదయ్య, మాజీ చైర్మన్ కుంచం మల్లయ్య, మాజీ సర్పంచు బొంగోని రాజయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచు వంగ శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గౌడ్‌ల సంక్షేమానికి పాటుపడతా


సీఐని సత్కరిస్తున్న గౌడసంఘ నేతలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గౌడన్నల సంక్షేమం కోసం ట్రస్టు ఏర్పాటు చేసి తనవంతు సహకారం అందిస్తానని ఉద్యోగ విరమణ పొందుతున్న సీఐ చిప్ప రాజమౌళిగౌడ్ అన్నారు. పెద్దపల్లిలో శనివారం గౌడసంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించి సీఐని ఘనంగా సత్కరించారు. సమావేశంలో రామగిరి ఎంపీపీ దేవక్క, నాయకులు మల్యాల రాంచంద్రం, సారయ్యగౌడ్, సింగం సత్తయ్య, బి.రమేశ్‌గౌడ్, బండారి సునీల్, శంకర్, లక్ష్మణ్, అన్నయ్యగౌడ్, అంజి, సదయ్య, పడాల కొమురయ్య, లెనిన్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు పోటీలు

పెద్దపల్లిరూరల్: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు జిల్లాస్థాయి పోటీలను శనివారం డీఈవో మాధవి జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో 26మంది బాలురు, 17మంది బాలికలు పాల్గొనగా పదిపాయింట్లు సాధించిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. జూలై 7న రాష్ట్రస్థాయి పోటీలుంటాయని తెలిపారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, సురేందర్, రవి, లక్ష్మణ్, శైలజ, శోభారాణి, ప్రణయ్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ పారిశుధ్య కార్మికులు కుర్మ ఎల్లమ్మ, కుర్మ వెంకటేశ్‌ను శనివారం మాజీ సర్పంచ్ ఆముల శ్రీనివాస్ సన్మానించారు. పూరి గుడిసెలో నివాసముంటున్న తల్లి కొడుకులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న మిర్యాల రాజిరెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా శనివారం సన్మాన సభ నిర్వహించారు. ఎంపీపీ కరుణశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్ డీఆర్‌డీవో పీడీ శ్రీధర్, హెచ్‌ఎం మల్లేశం, ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ స్వప్న పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌ల తొలగింపు

ఎలిగేడు: మండలంలోని లోకపేట గ్రామపంచాయతీ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్‌లను శనివారం ఎంపీవో అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. అనుమతి లేకుండా లేఅవుట్లు ఏర్పాటు చేస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంపీవో పేర్కొన్నారు.

డిప్యూటీ కమిషనర్ సేవలు అత్యుత్తమం


సన్మానిస్తున్న నగర మేయర్, కమిషనర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆర్.త్రియంబకేశ్వర్‌రావు అత్యుత్తమ సేవలదించారని నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ కొనియాడారు. త్రియంబకేశ్వర్‌రావు శనివారం ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్పొరేటర్లు శంకర్‌నాయక్, బాల రాజ్‌కుమార్, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, వెగోలపు శ్రీనివాస్‌గౌడ్, సలీం, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, నడిపల్లి మురళీధర్‌రావు, పెద్దపల్లి మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ అధికారులు రాజలింగు, చిన్నారావు, సుచరణ్, రామన్, మనోహర్, శ్రీనివాసరావు, శ్యామ్ పాల్గొన్నారు.

భారీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి


నూతన యంత్రం వద్ద అధికారులు

గోదావరిఖని: రూ.కోట్ల వ్యయంతో కొనుగోలు చేస్తున్న భారీ యంత్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ కోరారు. ఓసీపీ–3 డ్రిల్ సెక్షన్‌లో రూ.1.48కోట్లతో కొనుగోలు చేసిన నూతన హైడ్రాలిక్ క్రేన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి బొగ్గు ఉత్పత్తి కోసం కృషి చేయాలన్నారు. రక్షణ పాటించిన తర్వాతే బొగ్గు ఉత్పత్తిపై దృష్టిసారించాలని సూచించారు. నాయకులు జీగురు రవీందర్, అధికారులు నర్సింహారావు, మధుసూదన్, రాజాజీ, రమేశ్, శ్రావణ్, జనార్దన్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గోదావరిఖనిటౌన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.7వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మొలుగూరి సోను, ఎల్కలపల్లి సురేశ్, గొడిసెల ప్రణీత్, ధనాల దినేశ్, కల్వల సునీల్, మాడుగుల దీపక్, గంధ్రేటి శివ, అభిరాజ్, సృజన్, యూసుఫ్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ వెహికల్‌ను అడ్డుకున్న గ్రామస్తులు


ప్రైవేటు వెహికల్‌ను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: 'ప్రైవేటు స్కూల్ వద్దు ప్రభుత్వ స్కూలే ముద్దు' అంటూ మండలంలోని కూనారం గ్రామస్తులు ప్రైవేటు స్కూల్ వెహికల్‌ను గ్రామానికి రాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల నమోదు తగ్గడంతో సర్కారు బడి మూతపడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ప్రైవేటు స్కూల్ వాహనాలు గ్రామంలోకి రావొద్దని శుక్రవారం హెచ్చరించి వదిలివేశారు. శనివారం ప్రైవేటు స్కూల్ వాహనాలు రావడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. విద్యార్థులను వాహనాల నుంచి దించి ప్రభుత్వ స్కూల్‌లో అడ్మిషన్ చేశారు. ప్రైవేటు వాహనాలు గ్రామంలోకి రావొద్దని హెచ్చరించారు.

బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సేవాసప్తాహ కార్యక్రమాలు

గోదావరిఖనిటౌన్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ దేశవ్యాప్తంగా వారంరోజుల పాటు సేవా సప్తాహ పేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు పేర్కొన్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పవర్‌హౌజ్ కాలనీలోని శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతు మెడికల్ క్యాంపులు, బీద కుటుంబాలకు ఆసుపత్రిలో చికిత్స చేపించడం, ఉచితంగా మందుల పంపిణీ, రక్తదానం, మొక్కలు నాటడం కార్యక్రమాలు వారంరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, ఇస్సంపల్లి వెంకన్న, నేరేడుకొమ్మ వెంకటస్వామి, బండ సమ్మయ్య, కాస సత్యనారాయణ, సేవా సప్తాహ ఇన్‌చార్జి తిప్పర్తి శివ, ములుకుంట్ల శ్రీనివాస్, కొండపర్తి లింగయ్య, దిగంబర్, అరవింద్, చక్రపాణి, అనిల్, సంపత్‌యాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రైస్ మిల్లులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

సుల్తానాబాద్: పట్టణంలోని సాయితేజ, సుగ్లాంపల్లిలోని లక్ష్మి రైస్‌మిల్లుల్లో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీఎంఆర్ వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. ఓఎస్‌డీతో పాటు డీఎస్‌వోలు ప్రేమ్‌కుమార్, ఉమారాణి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, డీటీ రాజు, ఎస్సై కృష్ణ ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎకనమిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, గణితం, కంప్యూటర్స్‌లో గెస్ట్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే గోదావరిఖని కాలేజీలో తెలుగు, పొలిటికల్ సైన్స్, గణితం, బాటనీ, కంప్యూటర్స్, మంథని డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్, తెలుగు, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్స్ పోస్టులకు జూలై1లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు జూలై 2న పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

గుండెపోటుతో అటెండర్ మృతి

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన తూండ్ల రమేశ్(40)శనివారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రమేశ్ మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు స్కూల్లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం సైకిల్‌పై స్కూల్‌కు వెళ్లాడు. సైకిల్ దిగుతుండగానే గుండెపోటుకు గురై స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన టీచర్లు రమేశ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

జూలపల్లి: మండల కేంద్రంలోని కుర్మపల్లెలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో సంపద శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సేవలను పరిశీలించారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణపై ఎస్సై స్వామి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం గాయత్రి, కానిస్టేబుల్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వారసంత వేలం వాయిదా

ఎలిగేడు: మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహించే కూరగాయల మార్కెట్(వారసంత) వేలం శనివారం ఎలిగేడు జీపీ కార్యాలయంలో నిర్వహించారు. వేలంలో రూ.5వేలు డిపాజిట్ చేసి 8మంది పాల్గొనగా మార్కెట్ నిర్ణీత ధర వేలం రాకపోగా వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం వేలం నిర్వహిస్తామని కార్యదర్శి సౌమ్య తెలిపారు.

ఇష్టారాజ్యంగా ప్రైవేట్ స్కూళ్లు

రామగిరి: మండలంలో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఇష్టారీతిన దోచుకుంటున్నా.. జిల్లా విద్యాశాఖ అధికారి వారికే వత్తాసు పలుకుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ ఆరోపించారు. సెంటినరీకాలనీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దోపిడీకి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేనిచే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

విశ్వగురువుగా భారత్‌ను నిలిపేందుకు కృషి

జ్యోతినగర్: ప్రపంచానికి విశ్వగురువుగా అఖండ భారత్‌ను నిలపడానికి పీఎం మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు శాంతి కుమార్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని శ్రీమయి గ్రాండ్‌లో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

పది ఎకరాలకు రైతుబంధు వర్తింపజేయాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పది ఎకరాలు ఉన్న రైతులకు రైతుబంధు వర్తింపజేయాలని సమావేశంలో రైతులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం రైతుబంధు మార్పులు, చేర్పులపై రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. యైటింక్లయిన్‌కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయిస్తూ వేలం నిర్వహణను ఉపసంహరించుకోవాలన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూలై 1 నుంచి 9 వరకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జూలై 1న నల్లబ్యాడ్జీలతో నిరసన, 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం, 6న అన్ని ఏరియాల జీఎంలకు మెమొరాండం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ గోదావరిఖని చౌరస్తాలో కార్మిక వర్గంతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ధర్నాలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. టీబీజీకేఎస్ నాయకులు మల్లేశ్వరరావు,

సామాజిక సేవలో ముందుండాలి

సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ సేవలో వ్యాపారులు ముందు వరుసలో ఉండాలని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ సురేశ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ 23వ ప్రతిష్టాపన మహోత్సవం శనివారం స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా మాటేటి సంజీవ్‌కుమార్, కార్యదర్శిగా పిట్టల వెంకటేశ్, కోశాధికారిగా పూసాల సాంబమూర్తి, కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. 12 మంది సభ్యులతో ఇండక్షన్ ఆఫీసర్ గాలిపెల్లి వెంకట్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథి చిదుర సురేశ్, రీజియన్ చైర్మన్ గాలిపెల్లి వెంకట్, జోన్ చైర్మన్ వేముల విష్ణుమూర్తి మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, కొండ రాంబాబు సుధాకర్, కార్యవర్గ సభ్యులు దీకొండ భూమేశ్, గజభీంకార్ జగన్, రాయల్ల నవీన్, కోదూరి వెంకటేశం, నోముల వేణుగోపాల్, కట్ల సంపత్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.25కోట్లు



ఓదెల: మండలంలోని పొత్కపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి సీఆర్‌ఎఫ్ నిధుల కింద రూ.25కోట్లను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంజూరు చేశారు. పొత్కపల్లిలో ఎమ్మెల్యే చిత్రపటానికి శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య, మాజీ సర్పంచులు బొంగోని రాజయ్యగౌడ్, జక్కుల వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచు వంగ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజన్న, నాయకులు కట్కూరి సమ్మిరెడ్డి, హన్మంతరావు పాల్గొన్నారు.

'సమస్యలేమున్నా మాదృష్టికి తీసుకురండి'


నిల్వ నీటిని తొలగిస్తున్న చైర్‌పర్సన్ రమ

మంథని: మున్సిపల్ పరిధిలోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ అన్నారు. స్థానిక చైతన్యపురి కాలనీలో చిన్న వర్షానికే రోడ్లపై నీరు నిలుస్తోందని, దీంతో రాకపోకలకు అసౌకర్యం కలుగుతోందని స్థానికులు కౌన్సిలర్ ద్వారా చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన చైర్‌పర్సన్ శనివారం కమిషనర్‌తో కలిసి వార్డును సందర్శించారు. జేసీబీ సాయంతో రోడ్డుపై నిలిచిన నీటిని డ్రైనేజీకి తరలించారు. మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో పరిష్కరించుకునేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు చైర్‌పర్సన్ పేర్కొన్నారు.